నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 6 జనవరి 2025 | JAGTIAL

## 'విజ్ కిడ్ 2024-25 కాంటెస్ట్'కు స్పందన


పరీక్షకు హాజరైన విద్యార్థులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 5 : జిల్లా కేంద్రంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విజ్‌కిడ్ కాంటెస్ట్‌కి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కాంటెస్ట్‌ని 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న పారమితేతర విద్యార్థులకు నిర్వహించగా.. కరీంనగర్, వరంగల్, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 1400 మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు తెలిపారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభచూపిన ప్రతి తరగతికి పది మంది విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, అన్ని తరగతులకు కలిపి మొత్తం నగదు పురస్కారం రూ.4 లక్షలు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, రష్మిత, రాకేశ్, అనుకర్‌రావు, వినోద్‌రావు, వీయూఎం ప్రసాద్, రమణ, హన్మంతరావు, ప్రిన్సిపాల్ గోపికృష్ణ పాల్గొన్నారు.

---

# రూ.15వేలు ఇవ్వాల్సిందే

- రైతు భరోసాపై నమ్మించి.. మోసం చేస్తే ఊరుకోం
- ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- కాంగ్రెస్ సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేతల ఆగ్రహం
- మానకొండూర్‌లో ధర్నా
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రసమయి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్
- బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె హౌస్ అరెస్ట్
- మధురానగర్ చౌరస్తాలో ధర్నాకు అడుగడుగునా పోలీసుల అడ్డగింత
- ఇంటింటికీ వెళ్లి నాయకులు అదుపులోకి..


మానకొండూర్ పల్లెమీది చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు

**ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద ఎకరాకు పెట్టుబడి సాయం రూ.15వేలు ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. అనేక వాగ్దానాలు చేసి, మాటలతో మభ్యపెట్టి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ఆరో గ్యారెంటీ కింద ఇచ్చిన హామీని నెరవేర్చాలని, లేదంటే తన పదవికి రాజీనామా చేయాలని హెచ్చరించారు. రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ మోసంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల శ్రేణులు ధర్నా చేశారు. మానకొండూర్ మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తాలో జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పాల్గొనగా, గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో చేపట్టిన నిరసనకు పోలీసులు అడుగడుగునా అడ్డు తగిలారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను బూరుగుపల్లిలోని తన నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు.**

### కాంగ్రెస్ అంటేనే మోసం

మానకొండూర్‌రూరల్, జనవరి 5: ఆరో గ్యారంటీ అయిన రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఎలక్షన్ల ముందు రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం ఇవ్వాల్సిందేనని మానకొండూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో పల్లెమీద చౌరస్తాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని రైతుల తరపున నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టగా, ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి మాటా తప్పుతూ, ప్రతి హామీని విస్మరిస్తున్నారని, కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, నయవంచన అని మళ్లీ మళ్లీ నిరూపించుకున్నదని మండిపడ్డారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.12 వేలు మాత్రమే ఇస్తామంటూ మాట మార్చడం సరికాదన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చేదాకా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్ గౌడ్, శంకరపట్నం మండల అధ్యక్షుడు గంట మహిపాల్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్, నియోజక వర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

- మానకొండూర్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి


బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

### రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి: మాజీ ఎమ్మెల్యే సుంకె

గంగాధర, జనవరి 5: తప్పుడు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మధురానగర్ చౌరస్తాలో తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి బయలుదేరుతున్న ఆయనను బూరుగుపల్లిలోని ఆయన నివాసం వద్ద పోలీసులు బలవంతంగా హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రైతుల తరపున ప్రజాస్వామ్య యుతంగా పోరాటం చేయడానికి వెళ్తున్న తనను నిర్బంధించడం దుర్మార్గమని, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తున్నదా..? నిర్బంధ ప్రభుత్వం నడుస్తోందా..? చెప్పాలని పోలీసులను ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏం సాధించారని కాంగ్రెస్ నాయకులు సంబురాలు, పాలాభిషేకాలు చేస్తున్నారని, ఇచ్చిన హామీలను తప్పినందుకా ?, రైతు భరోసా ఇవ్వనందుకా ?, రుణమాఫీని పూర్తిగా అమలు చేయనందుకా ?, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వనందుకా..?, కాంగ్రెస్ నాయకులు ఎందుకు సంబురాలు చేసుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా గ్రామాల్లోకి వస్తే ప్రజలు తరిమికొడతారని పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ ధర్నాపై పోలీసు నిర్బంధం

రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని మధురానగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అడుగడుగునా అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ బలవంతంగా అరెస్టు చేసి, ఠాణాకు తరలించారు. హోటల్‌లో కూర్చొని టీ తాగుతున్న బీఆర్ఎస్ నాయకులను సైతం వదలకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాము ఏం తప్పు చేశామని, రైతుల తరపున పోరాటం చేయడమే తాము చెసిన తప్పా అని నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమకు కేసులు, జైల్లు కొత్తకాదని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రైతుల పక్షాన మరో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కాగా, నాయకులను సాయంత్రం దాకా ఠాణాలో ఉంచుకొని సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సాగి మహిపాల్‌రావు, మామిడి తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి,మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, యండీ నజీర్, రామిడి సురేందర్, ముక్కెర మల్లేశం, ఆదిమల్లు, నాయకులు మధుసూదన్, మధుసూదన్‌రెడ్డి, అఖిల్ ఉన్నారు.


గంగాధర పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

---

# ధరణి ఆపరేటర్ల వేతన వ్యథ!

## తొమ్మిది నెలలుగా ఎదురుచూపులు

- గడువు ముగిసిన టెర్రాసిస్ ఏజెన్సీ
- జనవరి ఒకటి నుంచి ఎన్ఐసీ పరిధిలోకి..
- వేతనాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- చేతులెత్తేస్తున్న అధికార యంత్రాంగం
- కుటుంబ పోషణ కోసం అగచాట్లు
- కొత్త ఏజెన్సీ పాత వేతనాల పంపిణీపై అనుమానాలు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిలో ఆందోళన



**తాము అధికారంలోకి వస్తే ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో ఉద్యోగాలు చేయడం భవిష్యత్‌లో ఉండదని, వారిని క్రమబద్ధీకరిస్తామని ఎన్నికల ముందు ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి రాగానే మాట మార్చింది. క్రమబద్ధీకరణ సంగతి దేవుడెరుగు, కనీసం వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చూస్తున్నది. తొమ్మిది నెలలుగా వేతనాలు అందక ధరణి ఆపరేటర్లు అరిగోస పడుతున్నారు. అధికారులు చుట్టూ తిరిగినా ప్రయోజనం లేక ఆవేదన చెందుతున్నారు. నిత్యం పనిచేయించుకోవడమే తప్ప తమకు వేతనాలు ఇచ్చే విషయంపై ఎవరూ దృష్టిపెట్టడం లేదని వాపోతున్నారు.**

కరీంనగర్, జనవరి 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్ : ఔట్‌సోర్సింగ్ విధానం (పొరుగు సేవల పద్ధతి)లో ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందిని కూడా కాంగ్రెస్ సర్కారు దగా చేస్తున్నది. రెవెన్యూ విభాగంలో అత్యంత కీలకమైన ధరణి సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా.. అమలులో నిర్లక్ష్యం చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేతనపెంపు దేవుడెరుగు కనీసం వేతనాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదనే ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లించాల్సింది పోయి.. తొమ్మిది నెలలైనా విడుదల చేయకపోవడంతో కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో ఉద్యోగాలు చేయడం భవిష్యత్‌లో ఉండబోదంటూ, తాము అధికారంలోకి రాగానే క్రమబద్ధీకరిస్తామంటూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. భవిష్యత్‌లో తమకు క్రమబద్ధీకరణ జరిగి, ప్రభుత్వోద్యోగులం అవుతామనే ఆశతో నామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్నా.. వాటిని కూడా చెల్లించడంలో తాత్సారం చేస్తుండడంతో ఆవేదనకు గురవుతున్నారు. తమ ఇళ్లలో పూట గడవడం కష్టంగా మారి, కుటుంబ పోషణ కోసం నానా అగచాట్లు పడుతున్నామని వాపోతున్నారు. దీనికితోడు ఇన్నాళ్లూ ధరణి పోర్టల్ నిర్వహించిన ఈ సెంట్రిక్ సంస్థ ఒప్పంద గడువు ముగియడంతో ప్రస్తుతం పారాడిమ్ సంస్థ ఆధ్వర్యంలో వీరంతా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ధరణి పోర్టల్‌ను ఈనెల ఒకటి నుంచి నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. తమ వేతనాల సంగతి తేల్చాలంటూ అధికారులను అర్థిస్తున్నా పట్టించుకునే లేరని వాపోతున్నారు. ఎవరికివారే తమకేమీ తెలియదంటూ అధికారులు చేతులెత్తేస్తుండగా, కొత్త ఏజెన్సీ తమకు రావాల్సిన పాత వేతనాల పంపిణీపై స్పందిస్తుందో..? లేదోనని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది కుటుంబాలు వీధిన పడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆందోళనలో కుటుంబాలు

ఉమ్మడి పాలనలో భూకబ్జాలు, ఆక్రమణలు, అక్రమ పట్టాలతో వివాదాలకు కారణమవుతున్న పట్టా, ప్రభుత్వ భూమిని పక్కాగా పర్యవేక్షించేందుకు వీలుగా స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భూ యజమానుల వివరాలన్నీ సేకరించి, వాటిని ధరణి పోర్టల్‌లో నిక్షిప్తం చేసిన విషయం తెలిసిందే. అప్పుడు భూలావాదేవీలు, క్రయవిక్రయాలు వంటి వాటి కోసం పనులు చేసేందుకు తహసీల్ ఆఫీస్ పరిధిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో కొంతమంది సిబ్బందిని ఏజెన్సీ సాయంతో నియమించారు. వీరిలో ప్రధానంగా ఆపరేటర్లు, కోఆర్డినేటర్లు, బఫర్లు ఉండగా, వీరంతా ప్రతి మండలంలోని తహసీల్ ఆఫీసుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి వేతనంతోపాటు ఇతర సౌకర్యాలన్నీ టెరాసిస్ ఏజెన్సీ కల్పించేది. నెలనెలా క్రమం తప్పకుండా ఆపరేటర్లు, బఫర్లకు ₹11 వేల వరకు, కోఆర్డినేటర్లకు ₹13 వేల వరకు వేతనం ఇచ్చేవారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారి వేతనాలు నిలిచిపోయాయి. అంతకుముందే ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ గడువు కూడా ముగియడంతో తిరిగి పునరుద్ధరించలేదు. ఈ సెంట్రిక్ సంస్థ తాత్కాలికంగా ఏజెన్సీ నిర్వహించింది. వీరి హాజరు పట్టిక ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపింది. అయినా, బడ్జెట్ సాకుతో వేతనాలు విడుదల చేయలేదని తెలుస్తున్నది. అయితే, ముందుగా ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులరైజ్ చేస్తారనే ఆశతో ధరణి పోర్టల్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. జనవరి నుంచి ఈ పోర్టల్ నిర్వహణ బాధ్యతలు రాష్ట్ర సర్కారు ఎన్ఐసీకి అప్పగించింది. దీంతో తమకు రావాల్సిన పాత వేతనాలపై అధికారుల వద్ద పట్టుబట్టుతున్నా స్పందించడంలేదని తెలుస్తున్నది. జవవరి వేతనం ఫిబ్రవరిలో విడుదల చేయగా, ఫిబ్రవరి వేతనం మాత్రం గత నెలలో విడుదల చేశారని ధరణి సిబ్బంది వాపోతున్నారు. వేతనాల కోసం సదరు ఆపరేటర్లు కలువని అధికారి లేడని, కాళ్లరిగేలా తిరగడంతో ఒకనెల వేతనం మాత్రమే అందించారని చెబుతున్నారు. వేతనాలందక తమ కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుండడంతో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులతో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వేతనాల కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇచ్చేది నామమాత్రపు వేతనం, అది కూడా సక్రమంగా విడుదల చేయకపోవడం సమంజసం కాదని రెవెన్యూ వర్గాల్లోని కొన్ని సంఘాలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ యేడాది ఒకటి నుంచి కొత్త ఏజెన్సీకి పోర్టల్ నిర్వహణ అప్పగించగా, వారి పెండింగ్ వేతనాలపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని, ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళన తొలగించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

---

# ఫిట్టింగ్ మాస్టర్ దుద్దిళ్ల.. కటింగ్ మాస్టర్ రేవంత్

- అమలుకు సాధ్యం కానీ హామీలతో మోసం చేసిన కాంగ్రెస్
- రైతు భరోసాతో మరోసారి తేటతెల్లం
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, జనవరి 5 : అమలుకు సాధ్యం కానీ హామీలను ఆరు గ్యారెంటీల పేరుతో ప్రకటించిన ఫిట్టింగ్ మాస్టర్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కటింగ్ మాస్టర్ సీఎం రేవంత్‌రెడ్డి అని, ఇద్దరూ కలిసి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అంటేనే మోసమని, రైతు భరోసాతో మరోసారి రుజువు చేసుకున్నదన్నారు. రైతాంగానికి ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి పెట్టుబడిసాయం బకాయి పడిందని, ఎన్నికల సమయంలో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి తాజాగా, రైతు భరోసా రెండు పంటలకు రూ.12 వేలు చెల్లిస్తామని ప్రకటించారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తే కేవలం రూ.2వేలు మాత్రమే పెంచారని, అవి కూడా రైతులకు ఎగనామం పెట్టిన డబ్బుల్లో నుంచి నాలుగేళ్లకు చూసుకుంటే రూ.8 వేలు మాత్రమే అవుతుందన్నారు. ఒక్కో రైతు దగ్గర కాంగ్రెస్ ప్రభుత్వానికే రూ.2 వేలు మిగులుతాయని, ఇందులో రైతు భరోసా పెంచింది ఏమీ లేదన్నారు. ఒక వైపు రుణమాఫీ కాక.. మరోవైపు బోనస్ బోగస్‌గా మారి రైతులు ఆందోళన చెందుతుంటే మరోసారి భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. చిన్న కాళేశ్వరం ఏడాదిలో పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికిన మంత్రి శ్రీధర్‌బాబు ఇప్పటికీ తట్టెడు మట్టి పోయలేదన్నారు. కానీ, రాష్ట్రానికి జీవధార లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును ఎడారిలా మార్చి ఇసుక వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు.

---

# మొండికేస్తున్న తలనీలాల కాంట్రాక్టర్!

- తొమ్మిది నెలలుగా రాజన్నకు ₹7.12 కోట్ల బకాయిలు
- కాంట్రాక్టర్‌పై న్యాయస్థానంలో కేసులు
- న్యాయపరంగా రాబట్టేందుకు అధికారుల చర్యలు
- ఈ నెల 18న రెండేళ్ల సేకరణకు టెండర్లు



**రాజన్న ఆలయంలో తలనీలాల కాంట్రాక్టర్ నగదు చెల్లింపులో మొండికేస్తున్నాడు. ఏకంగా తొమ్మిది నెలలుగా చెల్లించకపోవడంతో ₹7.12 కోట్ల బకాయి పడ్డాడు. దీంతో ఆలయ అధికారులు న్యాయపరంగా రాబట్టేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టారు. కాంట్రాక్టర్‌కు తలనీలాలు నిలిపివేయడంతోపాటు న్యాయస్థానంలో కేసులు వేశారు. అలాగే 2025-27 ఆర్థిక సంవత్సరాలకుగాను తలనీలాల సేకరణ కోసం ఈ నెల 18న టెండర్లు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.**

వేములవాడ, జనవరి 5: వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణకుగాను 2023-25 రెండు ఆర్థిక సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హిందూపురానికి చెందిన 'సుమిత్ ఎంటర్‌ప్రైజెస్' ₹19కోట్ల 8వేలకు టెండర్ దక్కించుకున్నది. సదరు కాంట్రాక్టర్ నాగరాజు మొదట ₹50 లక్షలు డిపాజిట్ చేసి, ప్రతినెలా ₹79,17,000 చెల్లించేందుకు 24 చెక్కులను ఆలయానికి అందజేశాడు. గతేడాది ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి నాటికి ₹8కోట్ల 92లక్షల 4500 చెక్కుల ద్వారా చెల్లించాడు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఆ తర్వాత చేతులెత్తేశాడు. నూతన ఆర్థిక సంవత్సరం 2024 ఏప్రిల్ నుంచి చెల్లించకపోవడంతో ప్రతి నెలా చెక్కు బౌన్స్ అవుతూ వస్తున్నది. గతేడాది డిసెంబర్ వరకు అంటే తొమ్మిది నెలలకుగాను ₹7కోట్ల 12లక్షల 53వేలు బాకీ పడ్డాడు. అయితే టెండర్‌లోని నిబంధనల ప్రకారం నగదు చెల్లించాలని కాంట్రాక్టర్‌కు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో ఆలయ అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చెక్ బౌన్స్ కావడంతో ఇప్పటివరకు న్యాయస్థానంలో నాలుగు కేసులు నమోదు చేశారు.

### ఆధీనంలోనే తలనీలాలు

కాంట్రాక్టర్ నగదు చెల్లించకపోవడంతో ఆలయ అధికారులు గత ఏప్రిల్ నుంచి తలనీలాలను నిలిపివేశారు. అప్పటి నుంచి కల్యాణకట్టలో భక్తులు సమర్పించే తలనీలాలను భద్రపరుస్తూ వస్తున్నారు. తొమ్మిది నెలలుగా సమకూరిన తలనీలాలు చెడిపోకుండా ఇప్పటికే రెండుసార్లు ఆరబెట్టారు. వాటిని వేలం వేసేందుకు అనుమతి ఇవ్వాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను కోరినట్టు తెలిసింది.

### ఈనెల 18న టెండర్

ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు అంటే మార్చి 31 నాటికి సదరు కాంట్రాక్టర్ గడువు ముగుస్తుంది. ఈ నేపథ్యంలోనే 2025-27 రెండేండ్లకుగాను తలనీలాల సేకరణకుగాను టెండర్, బహిరంగ వేలాన్ని మూడు నెలల ముందే ఈ నెల 18న నిర్వహించేందుకు సిద్ధమవున్నారు.


ఆలయ ఓపెన్ స్లాబ్‌పై ఆరబోసిన తలనీలాలు

### బకాయిలను రాబడుతాం



తలనీలాలను సేకరించే కాంట్రాక్టర్ తొమ్మిది నెలలుగా నగదు బకాయి పడ్డాడు. ఆ నగదును రాబట్టేందుకు ఇప్పటికే న్యాయపరంగా నోటీసులు జారీ చేశాం. నాలుగు కేసులు కూడా నమోదయ్యాయి. స్వామివారికి రావలసిన ప్రతి రూపాయిని న్యాయపరంగా రాబడుతాం. వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల కాలనికి ఈ నెల 18న తలనీలాల టెండర్ కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. - వినోద్ రెడ్డి, ఈవో (రాజన్న ఆలయం)